సాక్షి
సిద్దిపేట
బుధవారం, 20, సెప్టెంబర్, 2023



భూసారం పెంపునకే..

పంటల సాగుకు జీవ ఎరువుల ఎంతో ప్రధానం. రసాయన ఎరువుల వాడకంతో ఆహారం పంటలు, నేల, నీటి కలుషితం అవుతున్నాయి. దీనికి తోడు భూసారం తగ్గిచౌడుగా మారుతుంది.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

రేపు మెగా జాబ్‌మేళా

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఈనెల 21న డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 25 రాష్ట్ర, జాతీయస్థాయి కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చున్నారు. సిద్దిపేట ప్రాంత ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మా పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు

భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ



మాట్లాడుతున్న భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ

హుస్నాబాద్: తమ పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చిందని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ అన్నారు. పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ పార్లమెంట్ సభ్యురాలు గీతా ముఖర్జీ 1996, సెప్టెంబర్ 12న పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టారన్నారు. అప్పటి నుంచి గీతా ముఖర్జీతో పాటు అనేక మంది మహిళా నేతలు దేశవ్యాప్తంగా నిరసన గళాన్ని వినిపించారని తెలిపారు. మహిళా బిల్లు రాకుండా అనేక సందర్భాల్లో అడ్డుకున్నారన్నారు. రెండు సభల్లో ఆమోదం పొందడం హర్షణీయమన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య నాయకులు నేలవేని స్వప్న, బండి అనసూయ, పెద్ది నిర్మల, పొన్నాల స్వప్న, శనిగరం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతో గ్యారెంటీలేని హామీలు

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: అధికార దాహంతో కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా హామీలను గుప్పిస్తున్నారని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో స్కాములే తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అధికారమే లక్ష్యంగా తుక్కుగూడ విజయభేరీ సభలో గ్యారెంటీ లేని హామీలను గుప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్ని రకాల హామీలతో ముందుకు వచ్చినా ప్రజలు వారిని నమ్మేస్థితిలో లేరని చెప్పారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని అందుకొని అధికారాన్ని చేపట్టడం ఖాయమన్నారు.

పరిశోధన నిరంతరం జరగాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: పరిశోధనలపై అధ్యాపకులు దృష్టి సారించాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. కళాశాల అధ్యాపకులు రచించిన ఎడ్యుకేషన్ అండ్ సొసైటీ యూజీసీ కేరీర్ లిస్ట్‌లోని పరిశోధన జొర్నల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఈ పరిశోధన పుస్తక జొర్నల్‌ను భౌతిక శాస్త్ర విభాగాధిపతి మధుసూదన్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ రచించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాల సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్య రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సలీం, రవికుమార్, సుమలత, ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కస్సుబుస్సు

- హుస్నాబాద్‌లో పొన్నం, ప్రవీణ్ రెడ్డి వర్గీయుల పరస్పర దాడి
- సీడబ్ల్యూసీ సభ్యుల ఎదుటనే భగ్గుమన్న విభేదాలు
- ఇద్దరికి గాయాలు
- దుబ్బాకలో వేర్వేరుగా గ్యారెంటీ కార్డుల విడుదల
- అయోమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు


హుస్నాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్/దుబ్బాక టౌన్: జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల వర్గ విభేదాల పరంపర కొనసాగుతోంది. సీడబ్ల్యూసీ సభ్యుల ఎదుటే వర్గపోరు బయటపడింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలకు సంబంధించిన గ్యారెంటీ కార్డును ప్రజల్లో తీసుకెళ్లేందుకు నియోజకవర్గాలకు సీడబ్ల్యూసీ సభ్యులను ఆ పార్టీ అధిష్టానం పంపింది. హుస్నాబాద్‌లో సీడబ్ల్యూసీ సభ్యుడు మోహన్ ప్రకాష్, గజ్వేల్‌లో సీడబ్ల్యూసీ సభ్యుడు బాయ్ జెగ్ టాప్, సిద్దిపేటలో పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు అమరేందర్ సింగ్, దుబ్బాకలో మహేష్ శర్మ పాల్గొన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలను నిర్వహించగా హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీ ప్రభాకర్ వర్గీయులు పరస్పర దాడి చేసుకున్నారు.

తోపులాటలో ఇద్దరికి గాయాలు

హుస్నాబాద్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పార్టీ కార్యాలయాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. టికెట్ ఎవరి వారు తనకే వస్తుందని భావనలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. రెండు గ్రూపులుగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ అంతర్గతంగా ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా ఉంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాల గ్యారెంటీ కార్డును సోమవారం హుస్నాబాద్ పట్టణంలో పంపిణీ చేస్తున్న క్రమంలో ఎవరి వర్గం కార్యకర్తలు వారి పేరు జిందాబాద్ అంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. ఒకరిపై బాహాబాహీకి దిగారు. ఈ ఘర్షణలో ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు గాయాలయ్యాయి.

వేర్వేరుగా గ్యారెంటీ కార్డుల విడుదల

కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ కార్డును ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని దుబ్బాకలో ఎవరికి వారు నిర్వహించారు. దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి చెందిన పార్టీ కార్యాలయంలో గ్యారెంటీ కార్డును విడుదల చేసి, ధర్మాజీపేటలో కార్డుల పంపిణీలో సీడబ్ల్యూసీ సభ్యుడు మహేష్ వర్మ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీకకు చెందిన కార్యాలయంలో కార్డులను విడుదల చేశారు. అనంతరం గణపతి పూజల్లో మహేష్ వర్మ పాల్గొన్నారు. ఇలా ఇద్దరు నేతలు వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీడబ్ల్యూసీ సభ్యుడు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 16 మంది టికెట్ ఆశిస్తున్నారు. దీంతో ఎవరి వర్గాన్ని వారు కొనసాగిస్తున్నారు.

అయోమయంలో కార్యకర్తలు

హుస్నాబాద్, దుబ్బాకలో రెండు వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో కార్యకర్తలు అయోమయంలో పడిపోతున్నారు. ఎవరి వెంట నడవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. వర్గపోరుతో ఇతర పార్టీలకు లాభం చేకురుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం దృష్టి పెట్టి అందరిని ఒక్కతాటిపైకి తీసుకురావాలని కార్యకర్తలు కోరుతున్నారు.

పొన్నం వర్సెస్ అల్గిరెడ్డి

కొట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుకున్నారు. తోపులాట, పరస్పర దాడులు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాల గ్యారెంటీ కార్డును ఇంటింటికి చేరవేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి, సీడబ్ల్యూసీ సభ్యుడు మోహన్ ప్రకాశ్‌ను అధిష్టానం నియమించింది. ఈనెల 18న ఆయన హుస్నాబాద్‌కు వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆ సమయంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి జిందాబాద్ అంటూ ఇరువర్గాల కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగి పరస్పరం కొట్టుకున్నారు. దీంతో ఇద్దరు కార్యకర్తలకు గాయాలయ్యాయి. చివరకు కాంగ్రెస్ అగ్రనేతలు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పొత్తులో భాగంగా హుస్నాబాద్ సీటు కావాలని సీపీఐ పట్టుబడుతోంది. ఈ సీటు వ్యవహారం ఇంకా తేలకముందే పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా వర్గపోరు మొదలైంది. దీంతో కార్యకర్తలు ఎవరి వైపు వెళ్లాలో తెలియక అయోమయంలో పడ్డారు.



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో కొలువైన వినాయకుడు

గణనాథుడికి ఘనంగా పూజలు

కొమురవెల్లి(సిద్దిపేట): వినాయక చవితి పండుగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వినాయకుడి విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహిస్తున్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గణేశ్ నవరాత్రుల సందర్భంగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, నవగ్రహ ఆరాధన, మహాగణపతి ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ధర్మకర్తలు, అర్చకులు, అధికారులు, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్

మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.



మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.
98668 98692



గౌరారం స్కూల్ విద్యార్థులతో అదనపు డీసీపీ మల్లారెడ్డి తదితరులు

బాలికలు, మహిళల రక్షణకు షీటీమ్స్

వర్గల్(గజ్వేల్): బాలికలు, మహిళల రక్షణ కోసం షీటీమ్స్, స్నేహిత మహిళా సపోర్ట్‌సెంటర్, భరోసా సెంటర్లను ఏర్పాటు చేశామని అదనపు డీసీపీ(అడ్మిన్) మల్లారెడ్డి అన్నారు. మంగళవారం వర్గల్ మండలం గౌరారం జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థినులకు షీటీమ్స్, మహిళా చట్టాలపై గజ్వేల్ రూరల్ సీఐ జానకిరాంరెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. షీటీమ్ ప్రాముఖ్యత, విధులు, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ సెక్యూరిటీ, మైనర్ల డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్ తదితర అంశాలు వివరించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే డయల్ 100, సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నంబర్ 8712667434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. షీటీమ్ సేవలపై మాట్లాడిన విద్యార్థినిని అభినందిస్తూ టీకప్ బహూకరించారు. కార్యక్రమంలో గౌరారం ఎస్‌ఐ విజయభాస్కర్, హెచ్‌ఎం చంద్రారెడ్డి, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది, ఏఎస్సై శ్రీరాములు, పీసీలు శ్యామల, లావణ్య, మహేష్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భిన్న సంస్కృతులపై జాతీయ స్థాయి శిక్షణ

- పాల్గొన్న తెలంగాణ టీచర్లు
- పలు అంశాలపై శిక్షణ

మిరుదొడ్డి(దుబ్బాక): భిన్న సంస్కృతులపై అస్సాం రాష్ట్ర రాజధాని గుహవటిలో టీచర్లకు ఈనెల 13 నుంచి 22 వరకు జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అక్బర్‌పేట–భూంపల్లి మండలం కూడవెల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సత్యకుమార్ మంగళవారం ఫోన్‌లో తెలిపారు. తనతోపాటు భూంపల్లి ప్రాథమిక పాఠశాల టీచర్ పి.శ్రీనివాస్, వరంగల్ జిల్లాకు చెందిన టీచర్లు ఏవీఆర్ చార్యులు, వి.మంజుల, బి.సరిత, డి.రవి వర్మ, వి.రామ్మోహన్ పాల్గొన్నట్లు చెప్పారు. 'మన సాంస్క ృతిక వైవిధ్యం' ప్రధాన అంశంగా కొనసాగుతున్న శిక్షణలో సుమారు 13 రాష్ట్రాలకు చెందిన టీచర్లు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో తమ సంస్క ృతులను ప్రదర్శించడమే కాకుండా ఇతర రాష్ట్రాల సంస్కృతిపై అవగాహన పెంచుకుంటున్నామన్నారు. విద్యా విధానంలో సంస్క ృతి పాత్ర అంశాలపై సెమినార్లు, విద్యా విషయక పర్యటనలు నిర్వహిస్తున్నట్లు టీచర్లు తెలిపారు. సోనాపిచ్ ఆర్ట్, బుక్ బైండింగ్, బాంబో డిజైనింగ్, మోనో యాక్షన్, ఒరిగామి వంటి అంశాలపై శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు.


మేఘాలయ సాంప్రదాయ వేషధారణలో తెలంగాణ టీచర్లు


వర్గల్‌లో దయాకర్ తయారుచేసిన గోనెసంచుల గణపతి

ఎకోదంతుడు.. ఈ ఏకదంతుడు

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు, ఎకో ఫ్రెండ్లీ గణనాథుడే ముద్దు అంటున్నాడు వర్గల్‌కు చెందిన బీఫార్మసీ విద్యార్థి అయ్యగల్ల దయాకర్. అనడమే కాదు విభిన్నంగా పర్యావరణ హిత గణేశులను తానే తయారుచేసి పూజిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. నో కాస్ట్ లో కాస్ట్ అంటూ మూడేళ్ల క్రితం సొంతంగా తానే మట్టితో వినాయక విగ్రహం తయారుచేసి ఎకోఫ్రెండీ గణేశ్‌కు జై కొట్టిన దయాకర్, నిరుడు కాగితాలతో గణేశ్‌ను తయారు చేశాడు. తాజాగా ఈ నవరాత్రుల కోసం గోనె సంచి(గన్ని బ్యాగ్)తో 5 అడుగుల వినాయకుని తీర్చిదిద్దాడు. ఆలోచింపజేస్తున్న గోనెసంచుల వినాయకుడిని చూసి ప్రజలు మెచ్చుకుంటున్నారు. అతడి ప్రయత్నం ఫలవంతం కావాలని ఆకాంక్షిస్తున్నారు.

– వర్గల్(గజ్వేల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి పాలన

పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు అమరేందర్ సింగ్


మాట్లాడుతున్న పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు అమరేందర్ సింగ్

సిద్దిపేటజోన్: కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవినీతి పాలన సాగిస్తున్నాయని పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు అమరేందర్ సింగ్ ఆరోపించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 28 వార్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీములు వివరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరిచారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తాడూరి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): మిల్లెట్స్ ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. మంగళవారం కేజీబీవీలో ఐసీడీఎస్ సీడీపీఓ శారద ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ అభియాన్, పోషణ మాసోత్సవాల్లో మాట్లాడారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు పౌష్టికాహారంపై శ్రద్ధ వహించాలని, తెలంగాణ ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరునెలలు పొడిగింపు?


స్వామి వారి మూల విరాట్టు

నేటితో ముగియనున్న ఆలయ పాలక మండలి పదవీ కాలం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్తల మండలి పదవీ కాలం నేటితో ముగియనున్నది. గత సంవత్సరం సెప్టెంబర్ 20వ తేదీన దేవదాయ ధర్మదాయ శాఖ ఆలయ ధర్మకర్తల మండలిని 15 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో చైర్మన్‌గా గీస భిక్షపతిని ఎన్నుకున్నారు. వీరి పదవీ కాలం ముగియనుండటంలో మళ్లీ ఇదే కమిటీని మరో ఆరు నెలలు పొడిగించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రానున్న అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్ లేదా జనవరిలో జరిగే అవకాశం ఉండటంతో స్వామి వారి ఆలయంలో అభివృద్ధి పనులు కుంటుపడే అవకాశం ఉన్నందున డిసెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉంది. అలాగే నూతన పాలకమండలి ఏర్పాటుకు సమయం లేకపోవడంతో ఇదే కమిటీకి అవకాశం కల్పిస్తారని విశ్వసనీయ సమాచారం. దేవదాయశాఖ నూతన పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇస్తుందా, ఇదే పాలక మండలిని కొనసాగిస్తుందా, నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూందా ? అనేది ఆశావహుల్లో సందిగ్ధం నెలకొంది.

క్లుప్తంగా

ఉన్నత పాఠశాలలో కొండచిలువ



వెల్దుర్తి(తూప్రాన్): ఉన్నత పాఠశాలలో కొండచిలువ కలకలం రేపిన సంఘటన వెల్దుర్తి మండలంలోని మంగళవారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. బండపోసాన్‌పల్లి గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతి గదిలో ఒక్కసారిగా కొండచిలువ ప్రత్యక్షమవ్వగా విద్యార్థులంతా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. గదిలో కూర్చునే సమయంలో గోడ పక్కన కనిపించగా భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయుల సహకారంతో స్థానికులు చంపివేయగా అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కోతుల దాడిలో తొమ్మిది మందికి గాయాలు

చేగుంట(తూప్రాన్): కోతుల దాడిలో తొమ్మిది మంది గాయపడిన సంఘటన మండల కేంద్రమైన చేగుంటలో మంగళవారం చోటుచేసుకుంది. హనుమాన్ వీధిలో ఇంట్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్న కోతులను తరిమే క్రమంలో మనుషులపై దాడి చేశాయి. దీంతో పేర్ల పోచమ్మ, చందన, ప్రణయ్ తేజ, సిద్ధార్థ, బ్రహ్మచారి, రాణి, రామచంద్రం, ధీరజ్, చంద్రమౌళికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కాగా, పొలంపల్లికి చెందిన ముత్యాలు, మక్కరాజీపేటలోని చిన్నారి, చేగుంటకు చెందిన మరోవ్యక్తి కుక్కకాటుకు గురయ్యారు.

నిందితుడికి యావజ్జీవం

చేగుంట(తూప్రాన్): బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి లక్ష్మీశారద మంగళవారం తీర్పు వెలువరించినట్లు చేగుంట ఎస్‌ఐ హరీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రమైన మాసాయిపేటలో చదువుకుంటున్న బాలికను బెదిరించి తూర్పాటి కొమ్రయ్య 2022 నవంబర్ 18న లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బాధితురాలి వదిన ఈశ్వరి నవంబర్ 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి సాక్ష్యాధారాలు కోర్టుకు అందించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి పై శిక్షతోపాటు రూ. లక్ష 20 వేలు జరిమానా విధిస్తూ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు.

పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట(నర్సాపూర్): పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని దొంతిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్ రావు కథనం ప్రకారం.. జనగాం జిల్లాకు చెందిన శ్రావణ్‌కుమార్(23) ఎలక్ట్రీషన్ వర్క్ చేస్తున్నాడు. ఐదు నెలల క్రితం శివ్వంపేట మండలం దొంతికి చెందిన ఉప్పల సరితను ప్రేమ వివాహం చేసుకుని ఈసీఎల్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చి ఉంటుంది. సోమవారం అతను అక్కడి చేరుకొని ఇంటి వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రగాయాలైన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు సేకరించారు.

మద్యానికి బానిసై...



శ్రీనివాస్

హవేళిఘణాపూర్(మెదక్): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ మున్సిపల్ పరిధి అవుసులపల్లిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ అమర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగారం శ్రీనివాస్(35) ఆటోడ్రైవర్. ఆటో నడపగా వచ్చిన డబ్బులతో నిత్యం మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. సోమవారం రాత్రి కూడా గొడవ పడి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించేలోపే మృతిచెందాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూసారం పెంపునకే 'జీవ ఎరువులు'

- తునికి కేవీకేలో రూ. 55 లక్షలతో ల్యాబ్ ఏర్పాటు
- సేంద్రియ సాగుకు అనుకూలం
- తగ్గనున్న నేల కాలుష్యం.. పెరగనున్న భూసారం
- తక్కువ ఖర్చు.. అధిక దిగుబడి



కేవీకే ల్యాబ్

కౌడిపల్లి(నర్సాపూర్): పంటల సాగుకు జీవ ఎరువుల ఎంతో ప్రధానం. రసాయన ఎరువుల వాడకంతో ఆహారం పంటలు, నేల, నీటి కలుషితం అవుతున్నాయి. దీనికితోడు భూసారం తగ్గిచౌడుగా మారుతుంది. వీటన్నింటికీ ఈ ఎరువులతో చెక్ పెట్టవచ్చన్నారు. భూమి సారవంతమై పంటల దిగుబడి పెరుగుతుందని స్వచ్ఛమన ఆహారం ధాన్యాల పండి మానవాళి ఆరోగ్యం బాగుంటుందని కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కౌడిపల్లి మండలం తునికి వద్దగల డాక్టర్ డీ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో రూ.55 లక్షలతో జీవ ఎరువుల తయారీ ల్యాబొరేటరీ ప్రారంభించారు. అందులో ఎరువులను తయారు చేసి అమ్మకానికి ఉంచారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ఎఫ్‌సీఓ (ఫర్టిలైజర్ కంట్రోల్ అథారిటీ) ఎఫ్‌సీఓ 1985 ప్రకారం ఏర్పాటు చేసినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ల్యాబ్ ఇన్‌చార్జి రవికుమార్ తెలిపారు.

జీవ ఎరువుల అవసరం ఏమిటీ?

మన దేశ జనాభాలో ఇప్పటికీ 70 శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. దేశ తలసరి ఆదాయం పెంచాలంటే వ్యవసాయ ఉత్పాదక పెంపుదలతోపాటు సాగు ఖర్చు తగ్గించుకోవడం తప్పనిసరి. పంటల్లో ఉత్పాదకతను పెంపొందించాలంటే ప్రధాన పోషకాలైనటువంటి నత్రజని, భాస్వరం, పొటాష్‌లను అందించే రసాయన ఎరువుల వినియోగం తప్పనిసరి. పెరుగుతున్న శిలాజ ఇంధనాల ధరలు, ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల, ప్రతి ఏటా మన దేశం దిగుబడి చేసుకుంటున్న భాస్వరం, పొటాష్ ఎరువుల సబ్సిడీ వేల కోట్లలో ఉండటంతో మోయలేని భారం అవుతుంది. కాగా, ప్రస్తుత పరిస్థితులలో రైతులు రసాయన ఎరువుల మోతాదును తగ్గించి, జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్, పీఎస్‌బీ, మైకోరైజా వంటి వాటిని వినియోగించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవడంతోపాటు నేలలో పోషకాల సమతుల్యత దెబ్బతినకుండా కాపాడటం ద్వారా భూసారాన్ని పెంచి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త, ల్యాబ్ ఇన్‌చార్జి రవికుమార్ ల్యాబ్ అసిస్టెంట్ ఆఫీసర్ హింగే తెలిపారు.

అన్ని రకాల పంటలకు సిఫారసు

కేవీకేలో లభ్యమయ్యే జీవన ఎరువులను వాటి సిఫారసు మేరకు వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఉపయోగించడం ద్వారా నేల, నీటి కాలుష్యం అరికట్టి సుస్థిర, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. వరి, జొన్న, గోదుమ, తృణధాన్యాలు, పత్తి, మిరప, చెరుకు, పసుపు, కూరగాయలు, పండ్లతోటలలో జీవ ఎరువులు వాడవచ్చు.

ల్యాబ్‌లో తయారు చేసే జీవ ఎరువులు

1. రైజోబియం
2. అజోస్పైరిల్లమ్
3. అజోటోబ్యాక్టర్
4. ఫాస్పరస్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా
5. మైకోరైజా జీవన ఎరువు
6. పొటాషియం సాల్యుబులైజింగ్ బాక్టీరియా
7. అసిటోబ్యాక్టర్
8. జింక్‌ను కరిగించే బాక్టీరియా

రైతులకు మేలు



జీవ ఎరువులతో రైతులకు ఎంతో మేలు. ప్రధానంగా నేల కాలుష్యం, నీటి కాలుష్యం తగ్గించి భూసారం పెంచుతుంది. సేంద్రియ సాగుకు అనుకూలమైంది. నాణ్యమైన రసాయన రహిత ఆహారధాన్యాలు పండుతాయి. దీంతో ప్రజల ఆరోగ్యం బాగుంటుంది. ప్రస్తుత మార్కెట్‌లో సేంద్రియ ఆహార ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది.

రవికుమార్, కేవీకే శాస్త్రవేత్త ల్యాబ్ ఇన్‌చార్జి



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన రోటరీ షేకర్

విత్తన శుద్ధి మొదలు

జీవ ఎరువులైన రైజోబియం, అజోటోబ్యాక్టర్, ఫాస్పరస్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా, అజోస్పైరిల్లమ్, పొటాషియం సాల్యుబులైజింగ్ బాక్టీరియా, మైకోరైజా జీవన ఎరువు, అసిటోబ్యాక్టర్, జింక్‌ను కరిగించే బాక్టీరియాను విత్తన శుద్ధి నుంచి పంట వివిధ దశలతో ఎరువుగా వాడవచ్చు.

తయారీ విధానం

కేవీకేలో నూతన హంగులతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జీవ ఎరువుల ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. సీఐసీఆర్ ఎన్‌సీఎల్ (నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ) నుంచి మదర్ కల్చర్ తీసుకువచ్చి ల్యాబ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జీవ ఎరువులు తయారు చేయనున్నారు. ఇందులో అత్యధునిక ఆటోక్లేవ్, రోటరీ షేక్స్, ల్యామినార్ ఏర్‌ఫ్లో, మైకోస్కోప్, స్పెక్ట్రోఫొటో మీటర్, బీఓడీ ఇంక్యూబేటర్, కాలనీకౌంటర్ తదితర మిషన్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో కల్చర్ ఏర్పాటుకు రెండు నుంచి వారం రోజుల పాటు తయారీ చేయనున్నారు. తర్వాత జీవ ఎరువులను క్వాలిటీ అనాలసిస్ కోసం ఘజియాబాద్‌లోని ఎన్‌సీఓఎఫ్ (నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ ఫాం)కు పంపనున్నారు. అక్కడ చెక్ చేసిన తరువాత మార్కెట్‌లో విడుదల చేయనున్నారు. ప్రస్తుతం కేవీకేలో అమ్మకానికి ఉంచారు. లీటర్ బాటిల్ ధర రూ.160గా నిర్ణయించారు.



జీవ ఎరువుల డబ్బాలు



రేగోడ్(మెదక్): తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ బాధ్యులు

పార్టీకి వ్యతిరేకంగా వార్తలు రాస్తావా?

- అల్లాదుర్గం సాక్షి విలేకరిపై ఎంపీపీ అనిల్‌కుమార్ రెడ్డి దాడి
- ప్రాణహాని ఉందని బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు

వట్‌పల్లి(అందోల్): అల్లాదుర్గం సాక్షి విలేకరి వీరేందర్‌పై అధికార పార్టీ బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ అనిల్‌కుమార్ రెడ్డి మంగళవారం దాడి చేశారు. పార్టీకి వ్యతిరేకంగా వార్తలు రాస్తావా..? అంటూ దుర్భాషలాడారు. తన నివాసంలో పార్టీకి చెందిన కొందరు నాయకులు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అందులో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌కు వ్యతిరేకంగా చర్చ జరిగిందనే విషయాన్ని 'ఎమ్మెల్యే తీరుపై నాయకుల అసంతృప్తి' శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీన్ని జీర్ణించుకోలేని ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి.. సదరు విలేకరికి ఫోన్ చేసి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశం జరిగిందని నీకు ఎవరు సమాచారం ఇచ్చారు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అసభ్యపదజాలంతో దూషించాడు. 'నీవు ఎక్కడ ఉన్నావురా? నీ సంగతి చూస్తా'అంటూ బెదిరించాడు. అంతటితో ఆగకుండా అల్లాదుర్గం చౌరస్తా నుంచి బైక్‌పై వస్తున్న విలేకరి వీరేందర్‌ను అడ్డగించాడు. పోలీస్ స్టేషన్ సమీపంలో నడిరోడ్డుపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం సీసీ పుటేజీలో రికార్డయింది. కాగా, ఎంపీపీతో తనకు ప్రాణహాని ఉందని, వెంటనే అతన్ని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు వీరేందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి.దాసయ్య డిమాండ్ చేశారు. వార్తను అవసరమైతే ఖండించాలేగానీ భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అని చెప్పారు. నిత్యం ప్రజల సమస్యలపై వార్తలు రాస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటున్న తమపై దాడులకు పాల్పడితే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వీరేందర్

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

రేగోడ్(మెదక్)/తూప్రాన్: అల్లాదుర్గం సాక్షి జర్నలిస్ట్ వీరేందర్‌పై దాడి చేసిన అధికార పార్టీ ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రెస్‌క్లబ్ బాధ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. రాసిన వార్తను ఖండించే అవకాశం ఉన్నా దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ బాధ్యులు శంకర్‌గౌడ్, సంతోష్‌కుమార్, షఫీ, సుభాశ్, చంద్రమోహన్, షాహెద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోకుంటే ఆందోళన

ఎంపీపీపై చర్యలు తీసుకోకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని దళిత సంఘాల నాయకుడు దేవరాజ్ హెచ్చరించారు. అధికార పార్టీ అండదండలతో జర్నలిస్టులపై దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

అల్లాదుర్గం ఎంపీపీ అనిల్‌కుమార్ రెడ్డి స్థానిక జర్నలిస్ట్‌పై దాడి చేయడాన్ని టీయూడబ్ల్యూజే - ఐజేయూ మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి ఖండన తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా విలేకరులు పనిచేస్తున్నారన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న అతడిపై దాడికి పాల్పడటం అమానుషమన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి, గృహిణి

రూ.10.26 లక్షలను పోగొట్టుకున్న ఇద్దరు బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్ కు స్పందించిన ఇద్దరు భారీ నగదు పోగొట్టుకున్నారు. ఈ సంఘటనలు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈనెల 11న పార్ట్ టైం జాబ్ పేరిట వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. అందులో వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చాడు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతోపాటు కమీషన్ వస్తుందని నమ్మించి, రెండు దఫాలుగా రూ. 5 లక్షల చెక్కులు వేయాలని చెప్పారు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా వేశాడు. తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదు, కమీషన్ చూపిస్తున్నారు. చివరిగా వీటిని ఇవ్వాలని అడగగా స్పందించలేదు. మోసపోయిన్నట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయిరాం ఎంక్లేవ్ కు చెందిన ఓ గృహిణికి ఈనెల 5న టెలిగ్రామ్ ద్వారా జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. అందులో వివరాలను నమోదు చేసి రూ. 26 వేలు నగదు పెట్టుబడి పెట్టి, ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. చివరికి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించ లేదు. దీంతో మోసపోయిన్నట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్, సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసులను దర్యాప్తు చేస్తున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- క్షుద్ర పూజలు చేసిన దుండగులు
- రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఘటన





ఆలయంలో శివలింగాన్ని తొలగించి తవ్వకాలు జరిపిన దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): గుప్త నిధుల కోసం పురాతన కాలం నాటి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. ఈ సంఘటన చిన్నకోడూరు మండలంలో మంగళవారం వెలుగుచూసింది. మెట్‌పల్లి గ్రామ పంచాయతీ మధిర సలెంద్రి శివారులోని పురాతన కాలం నాటి రామలింగేశ్వర స్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఆదివారం అర్ధరాత్రి ఓ రైతు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా ఆలయం లోపల నుంచి శబ్దాలు వినిపించాయి. టార్చ్‌లైట్ వేసి పరిశీలించగా గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం రైతు, గ్రామస్తులకు తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే క్షుద్ర పూజలు చేసి, రెండు నల్ల కోళ్లను బలిచ్చి, నిమ్మకాయలు, కొబ్బరికాయలు, దీపాలు వెలిగించి ఉన్నాయి. ఆలయంలోని శివలింగాన్ని తొలగించి తవ్వినట్లు తెలుస్తోంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

కళ్లల్లో కారం చల్లి.. జుట్టుపట్టి కింద పడేసి..

పుస్తెల తాడు చోరీ

వట్‌పల్లి(అందోల్): మహిళ కళ్లల్లో కారం చల్లి బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు తెంచుకొని వెళ్లిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ గైబప్ప కథనం ప్రకారం.. అందోల్ మండలం సంగుపేటకు చెందిన బంటు అశ్విని జోగిపేటకు వెళ్లేందుకు బస్‌స్టాప్ వద్ద నిలబడి ఉంది. సంగారెడ్డి నుంచి ఒక ఆటో రాగా జోగిపేటకు వెళ్లాలని చెప్పింది. ఎక్కిన అనంతరం డ్రైవర్ రూట్ మార్చి బైపాస్ రోడ్డు వైపు పోనిచ్చాడు. అతడిని ప్రశ్నించగా ఆమెను నేరడిగుంట వద్ద దింపాడు. అక్కడి నుంచి రాంసానిపల్లి వైపు చేరుకుంది. జోగిపేటకు వెళ్లే క్రమంలో ఇద్దరు ముసుగు ధరించి వచ్చి కారాన్ని కళ్లల్లో చల్లి, జుట్టు పట్టుకొని కింద పడేసి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని హైవే వైపు పారిపోయారు. వెంటనే భర్త, సోదరుడికి ఫోన్ చేసి రప్పించింది. కాగా, జోగిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనా స్థలంలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆటో డ్రైవర్‌కు సంబంధించిన వ్యక్తులే బైక్‌పై వచ్చి దొంగతనానికి పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.

ఆరు గేదెల మృత్యువాత



సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి ఆరు గేదెలు మృత్యువాత పడిన సంఘటన చౌటకూర్ మండలం చెక్రియాల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇర్గిపల్లి సత్యయ్యకు ఆరు గేదెలున్నాయి. మంగళవారం ఉదయం మేత కోసం గ్రామంలోని మంజీరా పరివాహక ప్రాంతానికి తోలాడు. అక్కడ అవి మేసుకుంటూ వెళ్లి తెగి ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.

వైద్యుడిపై దాడి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడిపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి మంగళవారం తెల్లవారుజాము 5 నెలల గర్భిణి అత్యవసర చికిత్స కోసం వచ్చింది. ఫిజీషియన్ హరికృష్ణ రెడ్డి వైద్యసేవలు అందించారు. కాగా ఆమె చికిత్స పొందుతూ మంగళవారం గుండెపోటుతో మృతిచెందింది. దీంతో ఆమె బంధువులు అక్కడికి చేరుకున్నారు. అందులోంచి ఒక వ్యక్తి ఐసీయూలోకి వెళ్లి హరికృష్ణపై దాడి చేశారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో కొడుకు..

అప్పుడు అనారోగ్యంతో తండ్రి ..



స్వామి

చిన్నకోడూరు(సిద్దిపేట): బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీ కొని యువకుడు మృతిచెందిన సంఘటన చిన్నకోడూరు మండల పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. రామంచ గ్రామానికి చెందిన బాగ్యల స్వామి (19), తల్లి భాగ్య కూలి పనులు చేసుకుంటున్నారు. తండ్రి ఎల్లయ్య 40 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, ఆదివారం అతను బైక్‌పై సిరిసిల్ల జిల్లా నేరేళ్ల గ్రామంలోని అత్తింటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి తిరిగొస్తుండగా మల్యాల వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి ఈ విషయాన్ని గ్రామంలో చెప్పారు. ఉన్న ఒక్క కొడుకు మృతిచెందడంతో తల్లి రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సామగ్రి కోసం వెళ్లిన తాపీ మేస్త్రీ..

చేగుంట(తూప్రాన్): బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన వినాయక చవితి పండగరోజు మక్కరాజీపేట శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాసని లాలూ(29) తాపీ మేస్త్రీ. పండగ రోజు సామగ్రి తేవడానికి చేగుంటకు బైక్‌పై వచ్చి తిరిగి వెళుతుండగా మక్కరాజీపేట గ్రామ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు వాహనం చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హరీష్ సంఘటన స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలి

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి మాజీ ఎమ్మెల్యే వినతి



వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న రాజలింగం, కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ వినతి పత్రం అందించారు. మంగళవారం హైదరాబాద్‌లో అయన నివాసంలో కలిసిన వారు డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. గతంలో ఎంపీగా ఈ ప్రాంతంతో సంబంధమున్న వ్యక్తిగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. జిల్లాల ఏర్పాటు సమయంలో సిద్దిపేట జిల్లాలో కలిసిన జనగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించినట్లు పేర్కొన్నారు. ఒకప్పుడు చేర్యాల తాలూకా కాగా, నియోజకవర్గ కేంద్రంగా ఉండేది, కానీ రానురాను ఈ ప్రాంత మనుగడ ప్రశ్నార్థకంగా మారిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరాకల కోరికైన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లి డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి బావిలో పడి...

మూడేళ్ల క్రితం అనారోగ్యంతో తల్లిదండ్రుల కన్నుమూత

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి మతిస్థిమితం లేని బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని గుర్జాతండాలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. తండాకు చెందిన వాక్‌డోత్ అరుణ్(8) ఇంటిముందు ఆడుకుంటూ పక్కనే ఉన్న బావిలో పడ్డాడు. అతడిని రక్షించేందుకు చేసిన యత్నాలు సఫలం కాలేదు దీంతో మృతిచెందాడు.అరుణ్ తండ్రి శ్రీధర్‌తో పాటు తల్లి మూడేళ్ల క్రితం అనారోగ్యం బారిన పడి మృతిచెందారు. మృతుడి పెద్దనాన్న జయరాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో..

చేగుంట(తూప్రాన్): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చందాయిపేటలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరీష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి స్వామి(44) వ్యవసాయ పొలం వద్ద బోర్ మోటార్ స్టార్టర్ మరమ్మతు చేస్తుండగా షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించారు.

మూర్ఛతో యువకుడి మృతి



శ్రీనివాస్

శివ్వంపేట(నర్సాపూర్): మూర్ఛతో యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్(23) సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లి రాలేదు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోని కందకం వద్దకు వెళ్లగా మూర్ఛతో కందకంలోని నీటిలో పడిపోయాడు. మంగళవారం ఉదయం కందకంలో శ్రీనివాస్ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

ప్రాణం మీదకు తెచ్చిన ప్రేమ

కత్తితో యువకుడి మెడపై యువతి బంధువుల దాడి



గాయపడిన సాయికిరణ్

సిద్దిపేటకమాన్: ఇటీవల సోషల్ మీడియా పరిచయాలు ప్రాణాలు మీదకు తెస్తున్న ఘటనలు తరచుగా చూస్తున్నాం. వింటున్నాం. కానీ ఇదే తరహా సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడిపై ఆమె బంధువులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి కలకలం రేపింది. వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి కథనం ప్రకారం.. యాదాద్రి జిల్లా ఆలేరులోని పోచమ్మవాడకు చెందిన గుండ సాయికిరణ్ (25)కు పట్టణానికి చెందిన యువతితో ఓ సామాజిక చాట్ యాప్‌లో కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. మంగళవారం మధ్యాహ్నం మాట్లాడుకుందామని చెప్పి ఆమె పట్టణంలోని ఇంటికి పిలిచింది. విషయం తెలుసుకున్న యువతి బావ, బంధువులు అతడిపై కొబ్బరిబొండాలు నరికే కత్తితో మెడపై దాడి చేశారు. దీంతో తీవ్రగాయాలతో రోడ్డుపైకి పరిగెత్తుకుంటూ వచ్చి కింద పడి పోయాడు. స్థానికులు, రోడ్డుపై వెళ్లే వారు చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. పోలీసులు బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఘటన స్థలంలో సీసీ పుటేజీ పరిశీలించనున్నామని సీఐ తెలిపారు.